## మినీ కథ

# భూదాన యజ్ఞం

భమిడిపాటి అనంతనారాయణ



అనగా అనగా ఓ రాజు. ఆ రాజు పేరు సత్యరాజు. ఆ రాజుకి రెండొందల ఎకరాల జాగా వుంది విశాఖలాంటి వూళ్ళో. మద్రాసులాంటి ఊళ్ళో ఓ బంగళావుంది. అందులో అందమైన పెళ్ళాం వుంది. హైద్రాబాద్‌లాంటి ఊళ్ళో ఓ వుంపుడు కత్తె వుంది. అమెరికాలో కొడుకున్నాడు. లండన్‌లో కూతురు. అల్లుడూ వున్నారు. విశాఖలో ఆ జాగాలో ఓ తోట. ఓ గెస్ట్ హౌస్ వున్నాయి. వాట్ని చూడ్డానికి ధర్మారావు అను పేరుగల ఓ గుమస్తా వున్నాడు.

మద్రాసులోని సత్యరాజు. విశాఖలోని ధర్మరావుకి జాగా, తోట, గెస్ట్‌హౌస్ వ్యవహారాలు చూస్తుండమని మద్రాసులోను, హైద్రాబాద్‌లోను హాయిగా, సుఖంగా వున్నారు. ధర్మారావుకి ధర్మ కార్యాలంటే సరదా. అంచేత ఆ గెస్ట్ హౌస్‌ని ప్రేమికులకు లాడ్జి క్రింద ఇచ్చి సేవచేస్తూ. అంత జాగా అలా ఊరికే పడివుండడం ఎందుకని సదుద్దేశం కలిగి. ఓ బీద వేశ్యని కూడా పోషిద్దామనే వుద్దేశంతో ఆ జాగాని ఓ రెండొందల మంది మధ్య తరగతి ప్రజలకి. ప్లాట్లు వేసిఅమ్మేశాడు చవకలో ధర్మారావు. ఆ గెస్ట్ హౌస్‌ని "ఆడాకలి"తో వచ్చేవారికి "శరీరదానం" చేసి పుణ్యం కట్టుకుంటున్న అనసూయ అనే పతివ్రతచేత సేల్ డీడ్‌మీద ఆమె అమ్మినట్టు సంతకాలు చేయిస్తూ ఒకో జాగా ఐదువేల చొప్పున పదిలక్షలకి అమ్మేశాడు.

ప్రతీ సంతకానికి పాతికచొప్పున ఓ ఐదువేలు అనసూయమ్మ కూడా కష్టపడి సంతకం నేర్చుకున్నందుకు ఆర్జించింది.

రిజిస్ట్రారువారి మామూళ్ళు. డాక్యుమెంట్స్ రాసేవారి సాదరు ఖర్చులు. అనసూయమ్మ సంతకానికి అయిన ఖర్చులు పోను ఎనిమిది లక్షలు సునాయాసంగా తన చేతికి మట్టి అంటుకోకుండా ఆర్జించుకొని ప్రజలకి సరసమైన ధరలో "భూదానం" చేసి పుణ్యం కట్టుకున్నాడు ధర్మారావు.

అంతా అయ్యాక అంచెలంచెల మీద సత్యరాజుగారికి వారి వుంపుడుకత్తె తమ్ముడిద్వారా ఈ విషయం తెల్సి అర్జంటుగా ఓ లాయర్ దగ్గరకి వెళ్ళి ఈ జాగా తనదని. ఆ జాగా ఎవరమ్మినా చెల్లదని ఓ పత్రికా ప్రకటన ఓ కుర్రలాయర్‌చేత రాయించి ధర్మారావు దగ్గరకి విమానం మీద వచ్చి వాలేడు సత్యరాజు.

ఆ రాత్రి ఆ గెస్ట్‌హౌస్‌లో అనసూయ యిచ్చిన "ఆతిథ్యా"నికి తృప్తిపడి ధర్మారావు యిచ్చిన ధర్మమైన సలహాలు విని. రెండొందల మందికి కోర్టు నోటీసులు ఇచ్చి మూడుతరాలు కోర్టులచుట్టూ తిరిగి ప్రజల్ని కొట్టి లాయర్లని పోషించే బదులు అనసూయపేర్న సేల్ డీడ్ (Sale-deed) ఐదులక్షలకి అమ్మినట్టు రాసేయమని. ఆ డబ్బు యిచ్చేస్తానని వొప్పించేడు ధర్మారావు.

దక్కిందే దక్కుడని సేల్ డీడ్ అనసూయ పేర్న రాసేసి. ధర్మారావిచ్చిన ఐదు లక్షలు తీసుకొని అర్జంటుగా గుర్రప్పందేలకి హైద్రాబాద్ వెళ్ళిపోయారు సత్యరాజుగారు.

పేపరు ప్రకటన చదివి జాగాలు కొన్నవారు ధర్మరాజు దగ్గిరకి వచ్చి గొడవ చేశారు. వారందరికీ సర్దిచెప్పి. సేల్ డీడ్ అనసూయ పేర్న వుందని. కోర్టు గొడవలు లేకుండా చేయడానికి అందరినీ తలో రెండు వేలూ తెమ్మని ఆ డబ్బు కూడా తీసుకొని ఆ కేస్ క్లోజ్ చేశాడు ధర్మారావు. అనసూయకి గెస్ట్‌హౌస్ ధర్మం చేశాడు. అక్కడ ఇళ్ళు కట్టుకుంటున్న సామాన్య జనానికి ప్రోతల్‌హౌస్ అందుబాట్లో వుండడానికి. దూరంగా పోనక్కరలేకుండా.

సునాయాసంగా. కానీ పెట్టుబడి లేకుండా మొదటి ఎత్తులోనే మూడున్నర లక్షలు ఆర్జించిన ధర్మారావు ఆ పెట్టుబడితో రాజకీయాలలో అంచెలంచెలుగా మెట్లు ఎక్కుతున్నాడు. ధర్మారావు అమ్మిన జాగాలలో ఇళ్ళు కట్టుకున్నవారు "అనసూయా నగర్" పేర్న ధర్మారావుచేత ఆ కాలనీ ఆవిష్కరింపచేశారు.

ఇవాళ దినదిన ప్రవర్థమాన మవుతున్న నిస్వార్థ ప్రజాసేవకుడు ధర్మారావు ! ●